# కళారాధన

"ఈ సమయంలో కోసలరావు ఉంటే ఎంత బావుండేది!"

చలిగాలికి కిటికీలూ, తలుపులూ వేసుకుని కూచున్న మధ్యాన్నం అది. బయట తలుపుల్ని తట్టే గాలివాన. కాని గాలివానకోసం కాదు కోసల రావు. అతని అవస్త చెప్పుకుంటున్న జానకిరామయ్య కోసం.

"చేసుకున్న పిల్లల్ని వొల్లకపోవడం ఇప్పుడెంత ఎక్కువయిందంటావు! ఎక్కడ చూసినా రెండో పెళ్ళి, లేకపోతే ఎవత్తెనో తెచ్చుకోడం పరిపాటి అయింది. పూర్వం సిగ్గుపడేవాళ్ళు, నలుగురూ ఏమంటారోనని. ఇప్పుడు అదీ పోయింది."

"పూర్వం భార్యనిగాక ఇంకో స్త్రీని ఉంచుకోడం చాలా పరిపాటిగా మర్యాదైన పనిగా ఉండేది. ఈ క్రిష్టియన్లు వొచ్చి ఏకపత్నీత్వం నాగరికతా లక్షణమని బోధించడం వల్ల ఆ అలవాటు పోయింది. అందుకని ఈ విపరీతాలన్నీ."

"మొగవాళ్ళే నేమిటి? ఆడవాళ్ళే చేసుకున్న మొగుళ్ళు పనికి రాడంటో ఉంటే! అదెందు కంటావు?"

"అది స్త్రీ స్వాతంత్ర్య మోయ్!"

"మరి ఇంక ఇంతేనంటావా?"

"కలియుగం మరి! అదంతా ఇదివరకే రాసేశారుగా ఇలా జరుగుతుందని!"

"సరేలే. నా పిల్లలకే జరగడ మెందుకు?" అని విలపించాడు జానకిరామయ్య.

"ఏమంటాడు నీ అల్లుడు?" అన్నాడు ముసుకులోంచి చప్పున బైటికి వొచ్చి అచ్యుతం.

"ఏమీ అనడు. అఖ్కర్లేదు తీసుకుపొమ్మన్నాడు."

"ఏదో కారణం ఉంటుంది; కోసలరావే ఉంటేనా ఈ సమయంలో!"

"ఏమైనాడు వాడు. ఆ కోసలరావు?"

"ఎప్పుడు ఎక్కడుంటాడో ఎవరు చెబుతారు?" ఆ గాలినడుగు."

"ఏమిత్రా కోసలరావు విశేషం? వలపు మందులున్నాయా అతని దగ్గిర?"

"కోసలరావు సంగతి నీకు తెలీనే తెలీదా ఏమిటి? ఒక్క వలపు మందులేమిటి? తలుచుకుంటే, నీకు తెలీకుండానే నీ తలతీసి గాడిద తలని తగిలిస్తాడు."

"పోనిద్దూ పాపం, వీడితల గాడిదకి తగిలిస్తే అది ఏడ్చిపోతుంది. ఎందుకులే."

"ఆ కోసలరావు సంగతి చెపుదురూ?"

"మరి కాఫీ తెప్పించు, చెపుతాను."

కాఫీకి, ఫలహారానికి వంటింటోకి ఆర్డరు వెళ్ళిన తరువాత రాఘవయ్య చెప్పడం ప్రారంభించాడు.

"నాలుగేళ్ళయింది. నీ మాదిరి అవస్తే నాకు పట్టింది. చాలా మురిసి మురిసి చేశాననుకో ఆ పెళ్ళి. మా అల్లుణ్ణెరుగుదురుగా, గోవర్ధన్. ఎంత అందం, ఎంత నాజూకో. మనసూ హృదయం కూడ అల్లాంటివి. అప్పటికే గొప్ప చిత్రకారుడని అతనికి ప్రఖ్యాతి వొచ్చింది. ఆస్థి, విద్య, ఏం లోపం లేదు.

ఇంకా ఏదో నేర్చుకుంటున్నానని కలకత్తాలో వున్నాడు. వొచ్చి మద్రాసులో స్థిరపడతాడని, అప్పటికింకా అమ్మాయిని మా ఇంటి దగ్గరే వుంచమన్నాడు. రెండేళ్ళయింది, నాలుగేళ్ళయింది. ఆ కలకత్తా నించి రాడు. ఉత్తరాలు రాస్తే ఏదోరాస్తాడు. అదీ ఇదీ. ఆర్నెల్లు, ఏడాది ఆగమంటో, మనకో గొడవ వుందిగా! అత్తవారింటికి పంపకుండా ఆడపిల్లని అట్టిపెట్టుకుంటే, ఓ భూకంపాన్ని ఇంటో దాచుకున్నట్టు గోల చేస్తారు మనుషులు. అందుకని మనుషుల మాటలూ, ప్రశ్నలూ పడలేక అమ్మాయిని తీసుకుని కలకత్తాలో సరాసరి అతని ఇంటికి వెళ్ళాను. తలుపు తాళం వేసి వుంది. రాత్రి పదకొండు దాటితేగాని రాడన్నారు. నానా తిప్పలుపడి నేనూ మా పిల్లా, ఏదో హొటల్లో భోజనం చేసి, ఆ గుమ్మంలో పడి వున్నాం. రాత్రి పన్నెండయింది అతను వొచ్చేటప్పటికి. రెండు రోజులు ఉన్నాను కలకత్తాలో. అతను పొద్ద స్తమానం తన స్టూడియోకి వెళ్ళిపోయేవాడు, మేము వొచ్చాము అని అయినా ఇంటి దగ్గర ఉండవచ్చే అనుకున్నాను. కాని వాళ్లు మన మోస్తరు మనుషులు కాదు. ఆర్టిస్టు కదా. వాళ్ళ పద్ధతులే వేరు అని సరిపుచ్చుకున్నాను. అతను మాత్రం "త్వరలో నేనే మద్రాసు వద్దా మనుకున్నానే! తొందరపడి వచ్చారేం? ఈ గదులు నా వొక్కడికే తీసికొన్నాను ఇక్కడ వంటకీ దానికీ ఇబ్బంది" అన్నాడు. అంతే. అతను రోజల్లా వెళ్ళిపోతే ఒక్కత్తీ అమ్మాయి యెట్లావుంటుందా అనిపించింది. కాని అది ఫరవాలేదంది. నేను వొచ్చేశాను. తరవాత ఇరవై రోజుల్లో అదికూడా కలకత్తానించి యింటికి వచ్చేసింది మాట్లాడకుండా. తాను యింటికి వెడతానంటే, అతను రైలు యెక్కించేశాట్ట. నేనావూల్లో ఉండేటప్పుడే అనిపించింది. కొత్తగా భార్యకాపరానికివొస్తే అతనిమొహాన ఏ సంతోషమూ కనిపించలేదే అని. కాని ఆర్టిస్టులు అంతే గావును. మనకేం తెలుసు? మనం మామూలు రకం మనుషుల మైతిమి అని వూరుకున్నాను. ఎందుకు వొచ్చావే అంటే తన కక్కడ ఏం తోచలేదంటుంది. మొగుడితో తోచలేదని అంటే ఎట్లా సాగుతుంది? పోనీ రాత్రులు పన్నెండింటికి వొస్తాడా, అప్పుడైనా వొచ్చి పడుకోట్ట. పక్క దగ్గిర టెలిఫోను లోంచి ఎవరితోనో మాట్లాడుతో వుంటాట్ట. నిద్ర లేవగానే మళ్ళీ టెలిఫోనులో మట్లాడతాట్ట, ఇట్లా టెలిఫోనులో మాట్టాడుతోనే వెళ్ళిపోతాట్ట. మా అమ్మాయి అక్కడ తనకోసం ఉందని గుర్తే లేదుట. అంతేకాదు. అసలు ఏమీ

లేదుట. కన్యగా వెళ్ళిన మా అమ్మాయి కన్యగానే తిరిగి వొచ్చింది ఇంటికి. ఏం చెయ్యం. అతనికి ఏమని రాయం? పోనీ మాట్లాడదామంటే, అతని తరఫున పెద్దవాళ్ళెవరూ లేరు. ఇంకేం చేస్తాం. మనకో తృప్తి ఉందిగా ఈ దేశంలో దాని ఖర్మం, అది చేసుకున్న సుకృతం అని సమాధానం చెప్పుకున్నాను. కాని నా భార్య ఊరుకోలేదు. ఊరుకునే రకం మనిషికాదు. చాకలి జీతం ఎక్కువ కావాలంటాడా, నేను అవును. అన్నీ ప్రియమైనాయి. ఎక్కు వియ్యకపోతే బతుకుతారా?' అంటాను. కాని ఆమె వేసుకుంటుంది తగాదా. 'ఊరుకో అసలు పోతా'డంటాను. కాని వినదు. ఆ తగాదా ఆగి, చాకలి అడ్డమైన తిట్లూ తిని ఆ జీతానికే ఉతుకుతాడు. 'ఇంకేం లాభంలేదు. గేదె వొట్టిపోయింది. పాలు కొనుక్కుందాం' అంటాను. 'ఎందు కియ్యదు రోజుకి రూపాయి మేతమేస్తో?' అంటుంది. ఆ గేదె ఇంకో నెల పాలిస్తుంది. ఆమె గట్టిగా తలుచుకుని తగాదా పెట్టిందంటే, ఆకాశం బెదిరి వాన కురుస్తుందనుకుంటాను. అమ్మాయి తిరిగి వొచ్చిందంటే ఆమె ఊరుకోలేదు. 'ఏమిటో ఈ సంగతి కనుక్కుందాం' అని నన్నూ అమ్మాయినీ తీసుకుని కలకత్తా బైలు దేరింది.

ఎవరూ ఎప్పుడూ విని ఎరగని బంధువుల్ని కలకత్తాలో కనిపెట్టి, వాళ్ళ ఇంటో మమ్మల్ని దింపింది. వీళ్ళెవరా, ఏ బంధువులా అని చూశారు మొదట్లో వాళ్ళూ. కాని ఆమె మాటలవల్ల చాలా ఆప్తులైనారు. సాయింత్రం లోపల. వాళ్ళ చేతే ఆరాలు తీయించింది. మా అల్లుడుగారి సంగతి. చివరికి తేలిన విషయం ఇది ;

ఆ వూళ్ళో ఒక ఆంధ్ర వనిత వుంది. ఆమె పేరు సవితాదేవి. ఆమె ఒక నాట్యకళాశాల స్థాపించింది బెంగాలీ విద్యార్థినులకి. తెలుగు పిల్లలు కూడా వున్నారు. వాళ్ళు ఆమె ఇంటోనే వుంటారు. చాలా ప్రసిద్ధిలో వుంది ఆ కళాశాల. ఆమె అందమైనది. గుణవతి. పెద్ద చదువులు చదివింది. ఆమెకి ఓ భర్తా వున్నాట్ట. ఆ ఇంటో ఆమెతోనే ఉంటాట్ట. కాని అతని సంగతి యెవరికీ తెలీదు. ఆతనెవరో గుర్తించను కూడాలేదు. ఆమె యిల్లు నాట్యకళాశాలే కాదు. కళారాధకుల కందరికీ అది ఒక ఆలయం. ఆమె దేవి. మా అల్లుడు ఆ దేవాలయంలో ప్రధాన పూజారి. ఇతని స్టూడియో కూడా ఆమె మందిరంలోనే. అక్కడ కొందరు విద్యార్థినులకి పెయింటింగు నేర్పుతున్నాడట. ఆ సవితాదేవి అంటే మా అల్లుడికి, స్త్రీలలో అత్యున్నతమైన స్త్రీ. కళా స్వరూపిణి, ఆరాధ్య దేవత. ఆమె తప్ప ఇంక ప్రపంచం అతనికి లేదు. ఆమెనే అనేక చిత్రాలలో ఆదర్శం చేసుకుని, చిత్రించి అమితమైన ఖ్యాతి గడించాడు.

కాని ఇంతకీ ఆమె నిష్కలంక చరిత్ర. ఆ భర్త హస్తాలైనా ఆమెను కామంతో స్పృశించాయో లేదోనని అనుమానమే. అశ్లీలం, కామం, పురుషవాంఛ-ఇట్లాంటివి ఆమె ఆలయానికి రెండు మైళ్ళ దూరంలో తాత్కాలికంగా తొంగి చూడటానికి వీల్లేదు. ఎంతో మంచి మహనీయులైన పురుషులంతా దిన దినమూ ఆ ఆలయానికి హారతులర్పిస్తున్నా, ఆమె వీటన్నింటికీ అతీతురాలు-ఆమె, ప్రజల విరోదులైనా, ఆమెను గురించి రహస్యంగానైనా అపోహ పడడానికి వీలులేదు. తెల్లారింది మొదలు పడక సమయం వరకు ఆమె చుట్టూ

వంద జనం వుంటారు. విద్యార్థునులు, పరిచారికలు, మిత్రులు, ఆమెకు ఏకాంతమనేదే లేదు! రాత్రి పదకొండు కొట్టిందా, భర్తతో సహా, మా అల్లుడితో సహా అందరూ వెళ్ళిపోవలసిందే, ఆ కళానిలయాధిష్ఠాన దేవతకు మా అల్లుణ్ణి చూస్తే అమితమైన స్నేహం వాత్సల్యం, ఇష్టం అనురాగం. అతని కామె ఒక సోదరి. తల్లి. దేవత. అంతేకాని ఆమెకి ముందు ఎవరూ 'ప్రేమ' అని ఏ విషయంలో కూడా ఉచ్చరించడానికి వీల్లేదు."

అదీ చరిత్ర. బాగానే వుంది. కాని ఈ ప్రోగ్రాంలో మా అమ్మాయికి స్థానం లేదన్న సంగతి చాలా విదితమయింది. పోనీ రాత్రి పదకొండు తరవాత, తన భార్యని ఆదరించ కూడదా అంటే, సంగతుల్ని బట్టి అతను నిద్రావస్థలో కూడా ఆమె సహస్రనామార్చలోనే తత్పరుడైనట్లు కనబడుతుంది.

అతన్ని కలుసుకున్నాం. అతనిముందు నా భార్య తన జీవితంలో ప్రథమ అపజయాన్ని అంగీకరించింది. 'తన కళ, తన పని' అంటాడు యెంతసేపూ.

సవితాదేవి వూసెత్తలేదు.

మరి 'యెందుకు పెళ్ళి చేసుకున్నా'వని అదమాయించింది నా భార్య.

'తప్పే' నన్నాడు.

'ఇంతేనా' అంటే మాట్లాడడు.

'ఈ అమ్మాయినేం చేసుకోము ?' అంటే-

'మీ యిష్టం. ఇక్కడ వుంటే నా కభ్యంతరం లేదు. ఎందరు భర్తలు పొద్దస్తమానం తమ ఉద్యోగాలలో అర్థ రాత్రుల వరకూ ఉండి పోవడం లేదు? క్లబ్బులనించి అర్ధరాత్రికేగదా ఇళ్ళు చేరుకునేది?' అన్నాడు.

చివరికి తెగించి నా భార్య "మరి అప్పుడైనా అర్థరాత్రికైనా ఇది నీకు కనపడితే కద!' అంది.

"కనపడకేం?"

"లాభమేముంది?"

"కాని ఏం లాభం?"

"ఏం మాట్లాడువుట!"

"ఇంకా కొత్త కద?"

కాని అతని అయిష్టం కనపడుతోనే వుంది. ఇంక రెండే విధాలు.

మా అమ్మాయిని కూడా ఆ ఆలయంలో నన్నా చేర్చాలి. లేక అతని ఇంటిదగ్గిర దాని గతికి దాన్ని వొదలాలి. కాని దేనికీ సమ్మతించ లేదు మా అమ్మాయి. అది మితభాషిణి. కాని చాలా తెలివిగలది.

"ఏం తోచకుండా ఈ ఇంటో పడివుండే కంటే, హాయిగా ఇంటి దగ్గరే ఉంటేనేం?" అని అడిగింది.

"కాని-లోకులమ్మ!" అని ఏడ్చాను."

"లోకులకు నన్ను బలిస్తారా? సరేలే. వెళ్ళండి. మీకు అపరిదిష్ట లెండి. కాని మళ్ళీ నన్ను చూస్తామని ఆశ పెట్టుకోకండి" అంది.

ఈ పెళ్ళి అనేది క్రమంగా ఎంత రోత అయిన వ్యవహారమై పోతోందంటారు? వాళ్ళకి వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుంటే, ఏదో దాని ఫలితాలు వాళ్ళు అనుభవిస్తారు. మహా ఏదో అంతా తెలిసినవాళ్ళ మల్లే, తల్లి దండ్రులం, వాళ్ళకి ఓ మొగుణ్ని వెతికి తెచ్చి, కట్నాలిచ్చి కట్టపెట్టింతరవాత, వాడు చచ్చినా, పిల్లని వొదిలినా, "ఏం చేశావు నా బ్రతుకు?" అన్నాట్టు వాళ్ళ కళ్ళు మన వంక చూస్తున్నట్టే వుంటాయి.

గతిలేక, ఆడపిల్ల తలిదండ్రులమైనందుకు విధిని హిందూదేశాన్నీ, ఋషుల్నీ ఆచారాల్నీ తిట్టుకుంటో సవితాదేవిగారినే ఆశ్రయించబోయినాము. ఆమె మందిరం సాక్షాత్తు సరస్వతీ నిలయమనుకో. ముందు మా కసలు ప్రవేశం ఎంత కష్టమయిందంటావు ! సంగీతాలు, నాట్యాలు, చర్యలు, రంగు రంగు చీరెలు, సుగంధాలు....మా అల్లుడేమిటి, వీలైతే నేనూ ఓ పూజారినై ఉండిపోనా అక్కడ అనిపించింది. కాని ఓ పట్టాన ఆమె దర్శనం అయితేనా? అయిం తరవాత కూడా ఏకాంతంగా అమలు పడితేనా ? చివరికెట్టానై తేనేం సాయంత్రానికి సాధించాం. మా అల్లుడు ఏదో పటం గీస్తున్నాట్ట తన స్టూడియోలో, కొంతమంది విద్యార్థినుల సహాయంతో.

కనపడ్డ తర్వాత మమ్మల్ని చాలా మర్యాద చేసింది. మమ్మల్నేమిటి, ఎవరినన్నా చేస్తుంది. కుశలు ప్రశ్నలు వేసి అన్నీ కనుక్కుంది. ఒక గంటని గావును నొక్కింది. దాంలోంచి ఒక సంగీత స్వరం దూరంగా వినపడ్డది.

త్వరలో ఇద్దరు సేవకులో, విద్యార్థినులో - అమ్మాయిలు, చాలా అలంకారమైన పళ్ళాలలో ఫలహారాలూ, టీ తీసుకుని వొస్తున్నారు. వినపడే ఒక పాటకి పళ్ళాలతో సహా నాట్యం చేస్తో. అక్కడ పాటలు తప్ప మాటలు వుండవు. నాట్యం తప్ప నడక వుండదనద్నమాట. చాలా చుట్టు తిరిగి, చివరికి బల్లదగ్గిర ఒకన్ని వొంకర్లు తిరిగి పళ్ళాల్ని బల్లమీద పెట్టి వెనక్కి నాట్యం చేస్తో కళ్ళు తిప్పుతో నిష్క్రమించారు. ఆ ఫలహారాలన్నీ చాలా రంగురంగులుగా అనేక సుందరాకారాలలో చేశారు. కాని ఎన్ని తిన్నా బుగ్గలనిండా రావు. ఉత్తగాలి. టీ చాలా అందమైన కప్పుల్లో వుంది. కాని ఉగ్గుగిన్నెలంత వున్నాయి, ఆ కప్పులు. టీని ఒక్కొక్క చుక్కే నాలిక మీదికి అందంగా పోనిస్తో ఆమె-

"మీరు ధనవంతులే ననుకుంటాను?" అంది.

"ఏం ధనంలెండి......"

"నెలకు ఐదువందలు తీసుకుంటాను"

"ఈయిన అట్లాంటివాడు కారండి" అంది నా భార్య.,

బల్లకింద దాని కాలు నొక్కాను.

"చేర్చుకునేముందు మీ అమ్మాయికి కొన్ని టెస్టులు పెట్టాలి."

"అదీ ఆ టెస్టులు తినదు. నేను తిననీను" అంది నా భార్య ఖచ్చితంగా.

మళ్ళీ కాలు ద్వారా దాని నోరు నొక్కాను.

"అది కాదు. మే మో......"

"ఏది కాదు! మీ అమ్మాయి ఇక్కడ చేర్చాలని కాదా మీరు వొచ్చిందీ? ఐతే ఎందుకు వచ్చారు? టైమ్ వేస్ట్" అని లేచింది ఆమె.

"మే మో విషయమై......"

"విషయాలు ప్రస్తావించడానికి నాకు వ్యవధి లేదు" అని ఆమె మళ్ళీ ఇంకో నొక్కు నొక్కింది గంటని. ఇంకో విధంగా శబ్దమయ్యేట్లు.

నృత్యం చేసుకుంటో పువ్వులుచల్లుకుంటో వొస్తున్నారు ఇద్దరు యువతులు. మమ్మల్ని బైటికి పంపించడానికి. నేను లేచాను, మర్యాదగా వెడితే మంచిదని-, కాని నా భార్య లేచి తలుపుకి అడ్డంగా వాళ్ళని రానీకుండా చేతులు జాచి నిలబడి ప్రారంభించింది. "ఏమిటనుకుంటున్నావు ? ఈ కోతి వేషాల్ని చూసి నేను మోసపోతాననుకున్నావా, దడుసుకుంటా ననుకున్నావా? నువ్వేం ఆడదానివి కావటే? వీళ్ళందరూ ఆడవాళ్ళేనా ? ఇట్లా వంకర తిరుగుతో వీళ్ళ మొగుళ్ళతో ఏం కాపరాలు చేస్తారు ? ఇదిగో విను. అదంతా నాకెందుకుగాని, నా అల్లుడి జోక్యం నీ కెందుకు ? పొద్దస్తమానం నీ సేవ చెయ్యడమేనా అతని పని? ఎటువంటి శుభ్రమైన మనిషిని యే స్థితికి తీసుకొచ్చావు. అయిందేదో అయింది. ఇకనన్నా వొదులుతావా లేదా?"

ఆ సవితాదేవి తెల్లబోయి చూస్తోంది. ఆ మాటలు ఆమెకి అర్థం అయినట్టు లేదు.

"మీ అల్లుడేమిటి? ఎవరు?" అంది.

"గోవర్థన్. నీకు అతనెందుకు? పెళ్ళి చేసుకున్న పెళ్ళాన్ని వొదిలించి, నీవెంట తిప్పుకుంటున్నావా ? ఇదీ పరాయి దేశమై పోయింది. కాని తెలుగు దేశమే ఐతేనా, నలుగురిలో నీ మొహం ఈడిపిద్దును."

"మీరేదో చాలా అసందర్భంలో వున్నారు. ఆయన్ని ఎవరు వుంచారిక్కడ?" అంది ఆమె శాంతంగా.

"ఉంచకపోతే యెందుకు వుంటాడు ! నువ్వెవత్తవని, భార్యవా అక్కవా, నీ దగ్గిర ఎందుకు వుంటాడు........?"

చాలా శ్రుతిమించతోంది. కార్యం చెడిపోతుంది సరికదా, అసలు ఆ మాటలు చాలా అన్యాయమనిపించాయి నాకు. చప్పున భర్త వీటోని వుపయోగించి నా భార్యని శాంతింపచేశాను.

"గోవర్ధన్‌ని పిలు" అంది సవితాదేవి. నోళ్ళు వేళ్ళాడేసి, నర్తన మరిచి, మా ఆవిడ డాన్సు చూస్తో నిలబడ్డ పిల్లల్ని, నృత్యం చేసుకుంటో, పాడుకుంటో వెళ్ళిపోయినారు వాళ్ళు.

"ఇదేమిటండీ, ఆయన ఇక్కడ ఓ ఉద్యోగి" అంది మళ్ళీ సవితాదేవి.

"ఏం జీత మిస్తున్నావు?"

"జీతం లేదు. గౌరవోద్యోగి."

"ఏమిటా ఉద్యోగం, నీ వెంట తిరిగే వుద్యోగం. ఈ ఉద్యోగాలలో ఏ జీతం ముడుతో వుంటుందో నాకు తెలీకపోలేదు. నీ మొగుడితో నవ్వు సరిగా కాపరం చెయ్యి, లేకపోతే, ఇంకోడితో చెయ్యి నా అల్లుణ్ణి వొదిలెయ్యి."

"ఇంక నేను సహించను, సరిగా బయటికి నడుస్తారా, లేకపోతే దర్వానుచేత గెంటించనా ?"

"గెంటిస్తావా ? నన్ను గెంటిస్తావా ? నిన్ను ఈ దేశంలోంచి గెంటిస్తాను. పద-గెంటించు. ఏ మాత్రం......"

ఇంతలో గోవర్ధన్ వొస్తున్నాడు. అతని రెండు వేపులా ఇద్దరు కన్యలు ఆహ్వాననృత్యం చూపుతో తీసుకొస్తున్నారు. చాలా చాలా తీరుబడిగా మహారాజులాగు వొస్తున్న వాడల్లా అత్త కంఠం విని చప్పున పరిగెత్తుకొచ్చాడు మా వేపు. నృత్యానికి మధ్యనున్న ఆధారం పోయేప్పటికి, గాలిలో కాసేపు చేతులాడించి నుంచుని పోయినారు ఆ కన్యలు.

లోపలికి వొచ్చి, "ఏమిటి ? ఇదేమిటి ?" అంటున్నాడు గోవర్ధన్.

"వీళ్ళు......" అని పాపం మాట తెమల్చుకోలేక పోయింది. సవితాదేవి.

"ఎందుకు ఇక్కడికి వొచ్చారు? ఇంటికి రండి మాట్లాడదాము."

"ఆ మాటలై నాయిగా, నా మొహం, మాట్లాడేదేమిటి ? ఇదిగో చూడవోయ్. కళ అని, బొళ అని, పెళ్ళాన్ని వొదిలేసి, వీళ్ళ కొంగుల్లో ఆడుకుందామనుకున్నావు గావును. ఏదో చాలా పనిమీద ఉన్నావని, పిల్లని ఇంటిదగ్గిర పెట్టుకు కూచున్నాను, ఇన్నాళ్ళూ, ఇదా నీ పని, దీని పనీ పట్టిస్తాను" అని లేచింది మా ఆవిడ ఉగ్రురాలై పోయి. ఆమెని చూడ్డానికి నాకే భయమేసింది. ఈ ఆర్టిస్టులందరూ సాత్వికులు, అట్లానే మా అల్లుడునూ, అత్త రౌద్రాన్ని పటంకింద గియ్యగలడుగాని, ఆ రౌద్రానికి ఎదురు నిలవలేనంత సుకుమారి. ఎక్కడో తప్ప, సాధారణంగా యీ ఆర్టిస్టుల వ్యవహారమంతా పువ్వులతోనూ, దూది

మబ్బులతోనూ, తేట నీటితోనూ, చిన్న చిన్న పిట్టలతోనూ, మందహాసాలతోటే గాని, నిజమైన జీవితంలో ఓ చీపురు కట్టకి ఎవరూ జవాబు చెప్పలేరు. కోడిపిల్ల వాళ్ళని అరమైలు దూరం తరుముతుంది.

పాపం, నా భార్య ధాటికి సవితాదేవి మూర్ఛ పోయింది. మా అల్లుడు పన్నీరు తెమ్మన్నాడు ఆ పిల్లల్ని. వాళ్ళు చప్పున తెలివి తెచ్చుకుని, పన్నీరు పాట పాడుతో వెనక్కి నృత్యం చేస్తో కదులుతున్నారు. విధిలేక మా అల్లుడే పరుగున వెళ్ళి పన్నీరు తెచ్చి చల్లి ఆమెని కూచోబెట్టాడు.

"సవితా, నువ్వు వెళ్ళి పడుకో. నేను......."

"నీ వెనకనే నేనూ వొస్తా..." అని వెక్కిరింపుగా పూర్తిచేసింది నా భార్య.

అతను నా వంక తిరిగి "ఏమిటీ మాటలు? కొంచెం వూరకోబెట్ట లేరా?" అన్నాడు.

"నువ్వు కొంచెం వూరుకో. అతన్ని మాటాడనీ" అన్నాను నా భార్యతో.

"మీరు నమ్మాలి నా మాట. ఆ విధమైన ఆరోపణ వల్ల నాకు కాదు, మీరు ఆమెకి చాలా అన్యాయం చేస్తున్నారు. నమ్మండి నా మాట" అన్నాడు.

అతని మాటల్లో నిజం వుందనే అనిపించింది నాకు మాత్రం.

"అది సరే. మా అమ్మాయి సంగతి ఏమిటని? అదీ మాకు పట్టిన గొడవ."

"గోవర్ధన్ గొప్ప ఆర్టిష్టు. మీరు అతన్ని ఆ విధంగా చూడాలి గాని, మామూలు అల్లుడిలాగు మాట్లాడితే ఎక్కడామన మాటలకి పొందిక కుదరదు" అన్నది నీరసంగా సవితాదేవి.

నా భార్య జవాబుని ఆపి నేను, "ఆర్టిష్టులకి ఇల్లూ వాకిలీ, పిల్లా జల్లా ఉండడానికి వీల్లేదా?" అన్నాను.

"కాని అతను సామాన్యమైన ఆర్టిష్టు కాదు. అతని జీవితం కళకి అంకితమైపోయింది.

"కళ అంటే మీరేనా?" అంది చటుక్కున నా భార్య.

"ఏమిటి? తన వూళ్ళో, మా వూళ్ళో ఎక్కడైనా చిత్రాలు రాయవచ్చునే!" అన్నాను.

"ఇక్కడి వాతావరణం అతనికి చాలా అనుకూలం."

"సరేలెండి. రాత్రిం బగళ్లు కళే! చిత్రాలు రాసే వాళ్ళందరూ ఇలాంటి వాతావరణాల్నే పట్టుకుంటారా?" అన్నాను.

చిక్కంనించి తప్పించుకుని మా ఆవిడ "నీ వాతావరణమేనా? నువ్వుంటేగాని, నీతో...." అంటోంది.

"ఆగండి మాటాడకండి' అన్నాడు గోవర్ధన్.

"పోనీ ఆర్టిస్టులు భోజనం చేస్తారా, అందరిమల్లే?"

"అదీ ముఖ్యం కాదు, ఏదో యే వేళకో......"

"అలా ఏదో ఎప్పుడో తినే తయారవుతున్నారు. ఎండు నక్కల్లాగు. సరిగా వేళకి వొండుకు తింటే కళ రాదా? భోజనం చేస్తారుకద! ఇంక ఎటువొచ్చి పడకలేనా? భార్య కాకుండా వుంటేసరి కళేనన్నమాట!" అంది నా భార్య.

"నా మాట నమ్మండి. అతను నా తమ్ముడు. నన్ను అక్కా అని పిలుస్తాడు. మీ మలినమైన......"

నా భార్య విరగబడినవ్వి "అది కూడానా?" అంది.

"భార్య కళకి ఆటంక మంటారా?" అన్నాను, నా భార్య నవ్వును ఆపడానికి.

"కళకి ఓ అక్క ఉండాలా?......"

"అవును. భార్య ఆటంకమే. ఇల్లూ, సంసారమూ, పిల్లలూ, జబ్బులూ, చీదరా-అన్నీ కళని చంపేస్తాయి" అంది సవితాదేవి.

"భార్యతో కాపరంచేస్తే ఆటంకమూనూ, అక్కతో చేస్తే....."

గోవర్ధన్ లేచాడు, "ఇంక మీరు వెళ్ళడం మంచిది" అన్నాడు కఠినంగా.

"ఇంతకీ ఏమంటారు ?"

"ఏమీ అనను. మీ అమ్మాయిని ఎవరూ నిరాకరించటంలేదు. ఉండనియ్యండి. కాని ఆమె అతనికి భారం కాకూడదు. ఇట్లాంటి గొప్ప ఆర్టిష్టు మామూలు సంసారి ఐపోతే లోకానికే గొప్ప నష్టం" అంది సవితాదేవి.

"రాత్రులు పెళ్ళాం పక్కన పడుకుని టెలిఫోనులోంచి అక్కతో సరసాలాడుతోవుంటే ఇంక ఆ భార్య ఎందుకు ?"

"అతని జీవితం కళకి అంకితమై పోయింది. అటువంటి బోరన్ ఆర్టిస్టుకి మీరు మీ పిల్లని పెళ్ళి చెయ్యడం చాలా తప్పు చేశారు."

"అల్లాంటి బోరన్ ఆర్టిస్టు మా అమ్మాయిని పెళ్ళి చేసుకోవడంలో ఏమీ తప్పులేదా . పైగా పెళ్ళిచేసుకున్నందుకు పదివేలు ఖర్చుచేసి ఏదో కళాక్షేత్రమట - దాంటో నాలుగేళ్ళు చదివించాం" అన్నాను.

"అవును. అల్లాంటి ఆర్టిష్టుకి సహాయం చేసే అదృష్టం కలిగినందుకు మీరు గర్వపడాలి."

"ఇంటికి వెళ్ళి తీరకగా గర్వపడతాం లెండి, ఇప్పుడు మా పిల్లగతి ఏమిటి."

"ఏముంది? తన జీవితాన్ని గోవర్ధన్‌కి అంకితం చేసెయ్యమనండి. గొప్ప పతివ్రతలు అంతే కద;"

"మా అమ్మాయి జీవితం అతనికి అంకితమా ? అతని జీవితం నీకు అంకితమా? మా వూరైతేనా, నీ జీవితాన్ని పెంటకుప్పకి అంకితం చేద్దును. ఇంతేనా నువ్వనేది?" అంది నా భార్య.

"ఎందుకు ఊరికే ఘర్షణ పెంచుకుంటారు? నా అభిప్రాయం ఇది వరకే చెప్పాను. రా, సవితా ?" అని ఆమెని బుజంమీద చెయ్యేసి తీసుకు వెళ్ళిపోయినాడు మా అల్లుడు.

అదీ, నా భార్య పొందిన పరాజయం.

వొచ్చేశాం మా వూరు.

అటు తరువాత రెండేళ్ళకి గావును కోసలరావు వొచ్చాడు మా ఇంటికి. కోసలరావు ఇంటికి వొచ్చాడంటే-ఆ ఇంటి యజమానితోనే కాదు, ఇంటి పిల్లతోకూడా పరిచయం చేసుకుంటాడు, వాడు ఉన్న మూడు గంటల్లో. అతను వెళ్ళిన మూడు నెలలదాకా వెతుక్కుంటోనే వుంటాం అతను వెళ్ళిపోయినాడని. అదొక అవతారమో, అసాధారణ జాతకమో మరి! వొచ్చిన అయిదు నిమిషాలకే మా అమ్మాయితో బాతాఖానీ వేశాడు. అది అల్లిన కుట్లు చూశాడు. రెండు పాటలు పాడించాడు. తనకంటె గొప్పవాడు అని ఎవరినన్నా నా భార్య అంగీకరించిందంటే అతనే కోసలరావు! వెంటనే ప్రారంభించింది. అతని దగ్గిర తన హృదయ బాధ. ఆమె వాక్ప్రవాహాన్ని అరికట్టగలవాడు కూడా అతనొక్కడే. అప్పటికా ప్రశంస ఆపి, భోజన మయ్యాక, తాంబూలం వేసుకున్నటప్పటికి వాయిదా వేయించాను కష్టంమీద. మధ్యాహ్నం యీజీఛైర్లో పడుకుని, నా భార్య వాగ్భాగీరథికి ఆనకట్ట తలుపులు ఎత్తించేశాము. కోసలరావు మా అమ్మాయి సంగతి, అత్తవారింటి సంగతి అడుగుతున్నాడో లేదో-ఇంతలో లోపల్నుంచి వొచ్చింది నా భార్య.

"అల్లుడు! ఇంకేం అల్లుడు నాయనా!" అంది.

"ఏమిటి ? ఏమైనాడేమిటి ?" అన్నాడు కోసలరావు కుర్చీలో దిగ్గున లేచి కూచుని.

"కళకి అంకితమైపోయినాడు."

"అదేమిటి?"

"కళకో, కళావతికో అంకితమై పోయినాడు. అట్లాంటి వాళ్ళకి భార్యలు అనవసర మట!"

"ఏ వూళ్ళో ?"

కలకత్తాలో.

"కలకత్తాలోనా? కళకా?.....కొంపతీసి ఆ సవితకి కాదు కదా?"

"సరిగా కనుక్కున్నారు."

"అట్లాగా. సవితకి అంకితమైతే ఊడతియ్యడం కష్టమే."

"మీకు తెలుసునా ఆమె ?"

"తెలీకేం ? వాళ్ళది రాజోలే. పెళ్ళి కూడా మామూలుగానే అయింది. పెళ్ళికి వెళ్ళాను కూడా నేను.......కాని, ఇప్పుడు తెలుగు మాట్లాడదు ఆ అమ్మాయి. తెలుగుదేశం వొదిలి, చాలా ఉన్నత దశకి వొచ్చింది. మీ అల్లుడూ ఆమా కాపరం పెట్టారా ?"

"ఎబ్బే - లేదు, అట్లాంటి మాట ఆ మందిరంలో ఉచ్చరించకూడదట."

"మీరేం ప్రయత్నాలు చేశారు?"

"ఏం చేశాం ? ఇది ఆమెను పట్టుకుని నానా మాటలు అంది, అనవలసినవన్నీ."

"అంతేనా? అదేం లాభంలేదు. పైగా ఆమెకు చాలా గొప్పవాళ్ళ మద్దత్తు వుంది. ఆమె భారతీయ కళని ఉద్ధరిస్తోందని గొప్ప పదవుల్లో ఉన్న చాలామంది గొప్పవారి నమ్మకం."

"ఇంక ఇంతేనంటారా మీరూ? మీ మీద గంపెడాస పెట్టుకున్నాం"

"ప్రయత్నం చేద్దాం. ఫలించినా, మీ అమ్మాయి అతనితో కాపరం చేసేందుకు ఓ రెండు మూడేళ్ళు పట్టవచ్చు."

"రెండు మూడేళ్ళే!"

"చెప్పలేను అప్పుడే. అసలు సంగతులు నాకు స్పష్టంగా తెలీవు. తెలిసే అవసరం పుట్టలేదు......పదవోయ్, బయలుదేరు."

"ఎక్కడికి?"

"కలకత్తాకి."

"ఏం లాభంలేదయ్యా. అన్నీ చూశాం."

కాని నా భార్య ఊరుకోలేదు. సామాను సర్ది నన్ను ఇంటోంచి బయటికి గెంటింది. బండి ఎక్కినప్పటినుంచి నా ఛార్జి కోసలరావే తీసుకున్నాడు. నా డబ్బూ అతనే తీసుకున్నాడు. ఏ టిక్కెట్టు కొన్నాడో ఎవరితోనో మాట్లాడి ఫస్టుక్లాసులో ఎక్కి నిద్రపోయినాము. కలకత్తాలో ఓ కారెక్కించి ఎవరో బెంగాలీల ఇంటో దించాడు నన్ను. ఆ బెంగాలీల వంటింటో చేరి వాళ్ళచేత తెలుగు వంట చేయించాడు. భోజనమయిం తరవాత "మరి ఇప్పుడేం చేదాం?" అన్నాను.

"ఏం చెయ్యొద్దు. హాయిగా కూచో. తోచకపోతే గొప్ప మ్యూజియం వుంది-అది చూడు. సాయంత్రం పార్కులకు పో."

"నువ్వా?"

"నాకు బోలెడు పనులు. కనపడ్డప్పుడు కనపడతాను. నే నుంటే వీళ్ళచేత చారూ అవీ కాయిస్తాను. నేను లేక, ఇక్కడ తిండి సయించక పోతే, పక్క సందులో అరవ హొటలు వుంది. అక్కడ భోంచెయ్యి.

"అదంతా సరేలే. మనం వొచ్చిన పని....."

"నేను చూస్తాగా."

పదిరోజు లయింది. కోసలరావు కనపట్టం లేదు. నేను లేచేటప్పటికే వెళ్ళిపోతాడు. కొన్ని రాత్రులు రానే రాడు. పది మందితో కలసి హడావిడిగా వొస్తాడు. చూస్తుండగా ఏదో భాషలో మాట్లాడుకుంటూ వెళ్ళిపోతాడు. అప్పుడప్పుడు "డబ్బు వుందా ? ఏమన్నా కావాలా?" అని కేకేసి పోతాడు, తన డబ్బు నా కిస్తున్నట్టు. మొదలే చెప్పాడు-ఓ వెయ్యి రూపాయలు తీసుకురమ్మని.

ఓ రాత్రి ఒంటి గంటదాకా మేలుకుని కూచున్నాను అతని కోసం. వొచ్చి నన్ను చూసి, "ఇంకా మేలుకుని వున్నావేం?" అంటో తనగదిలోకి పోతున్నాడు. నేను అతన్ని ఆపి "ఇంకెన్నాళ్ళు?" అన్నాను.

కొంచెం ఆలోచించి. "అవును. నీదో వ్యవహారం వుందికదూ! కనుక్కుంటాను. నాలుగైదు రోజుల్లో తీరిక దొరుకుతుంది. మాట్లాడతాను" అంటూనే వెళ్ళి గురక కొడుతున్నాడు.

అతని హడావిడి చూస్తే, ఇన్నాళ్ళూ ఆ ప్రయత్నమంతా నా విషయమే అనుకున్నాను. ఒకటే టెలిఫోన్లలో మాట్లాడడం, ఎవరినో కార్లలో తీసుకురావడం అదీను. టెలిగ్రాం ఇచ్చి మా అమ్మాయిని రప్పించడమే తరువాయి అనుకుంటున్నాను. నాలుగైదు రోజుల్లో ఇంకా ఏదో మాట్లాడతాట్ట!

మూడో రోజు రాత్రే మంచి నిద్రలో ఉన్న నన్ను లేవకొట్టాడు.

"నేను అనుకున్నదంతా అయ్యింది" అన్నాడు నిరశాతో.

"ఏమిటి?"

"ఆ సవితకీ నీ అల్లుడికీ మధ్య ఏం లేదు" అన్నాడు దిగులుతో.

"ఇదా నువ్వు కనుక్కున్నది ఇంతదూరం వొచ్చి, పైగా నాడబ్బంతా ఖర్చుచేసి....." అనుకున్నాను మనసులో.

"డబ్బైపోయింది" అన్నాడు.

"ఏమిటి, వెయ్యిరూపాయిలూనా?"

"కాక? వైరియ్యి రేపు, ఇంకో వెయ్యి పంపమని. డబ్బు రాగానే రెండు రోజుల్లో వెళ్ళిపోదాం.! నేను వొచ్చిన బిజినెస్ అయిపోయింది."

"నువ్వు వొచ్చిన పనేమిటి? నాదేగా!"

"నీదా? నాకెన్ని పనులు! నీది చాలా చిన్న వ్యవహారం."

"సరే. ఇప్పుడేమిటి ఇంతకీ? వాళ్ళమధ్య ఏం లేకపోతే ఇంత గొడవెందుకు?"

"ఇది సాధారణ వ్యవహారం కాదోయ్. దీని పరిహారం సైకాలజికల్‌గా జరగాలి. వాళ్ళిద్దర్నీ తందామనుకున్నాను. లాభంలేదు. వాళ్ళిద్దరి మధ్యా ఏం లేదు."

"లేకపోవడ మేమిటి? నాన్‌సెన్స్."

"లేకపోవడమేం? బోలెడు వుంది!"

"మరి!"

"అంటే పడకలు లేవు. అదే వొచ్చిన ఖర్మం."

"ఏమిటో మాట్లాడుతున్నావు."

"విను. ఆడదానికీ, మొగవాడికీ వుత్త స్నేహముండి, అన్ని వీళ్ళూ వుండి, పడకలు లేకపోతే; అది చాలా అసహజం. అందువల్ల అపాయకరం. ఎందుకు పడుకోరు? అది చెప్పు."

"అవును. ఎందుకు పడుకోరు? పరువు నష్టమేమో!"

"అదికాదు ఇక్కడ. ఎవరికీ ఏమీ తెలీకుండా సాగించవొచ్చు. పైగా వాళ్ళిద్దరికీ సంబంధం లేదని ఎవరూ అనుకోడంలేదు. ఇంకేం?

"పిల్ల భయమూ లేదు....." అన్నా.

"అవును. ఆమెకి అన్నీ తెలుసు. అదీగాక ఆమెకు పిల్ల లేమిటి. ప్రజాపతికూడా, చివరికి-బాలనాగమ్మలో డాక్టర్ గోవిందరాజులు కూడా- ఆమెకు ఓ పిల్లనీ ఇవ్వలేదు. విను. ఇట్లా వాళ్ళు విడిగా వుండడం చాలా ఘోరం. కలుసుకుంటే కళకు అపరాధంట, ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి అపరిమితమైన కాంక్ష, కాని కళకోసం తీర్చుకోరు. ఆ మత్తులో పడ్డ వాళ్ళని బయటికి లాగడం ఎవరి తరమూ కాదు.

ఇంక రెండేళ్ళుపోతే అసలు ఏ భార్యా ఉపయోగం వుండదు. త్వరలోనే రక్షించాలి అతన్ని-నీ కోసం..... అంటే నీ కూతురికోసం. అని గుర్రు పెడుతున్నాడు ఓ నిమిషంలో.

మర్నాడు పగలంతా ఎక్కడెక్కడో తిరిగి, డబ్బుకోసం టెలిగ్రాం యిచ్చి, 'ఈ కబుర్లు చెప్పడానికా నన్నింత దూరం ఇతను తీసుకువచ్చి ఖర్చు చేయించాడు అని కోసల రావుని తిట్టుకుంటో, టెలిగ్రాం రాగానే ఆ డబ్బు అతని చేతికివ్వకూడదని నిశ్చయించుకుని నిద్రపోతోబోతో వుండగా కోసలరావు వొచ్చాడు.

"అప్పుడే ఏం నిద్ర?" అని నన్ను తనతో ఓ పెద్ద హొటలుకి లాక్కెళ్ళాడు. దాని దర్జా చూస్తేనే చాలా డబ్బు ఖర్చయ్యేట్టుంది. ఆ రాత్రి.

"నా దగ్గిర డబ్బు లేదు, నీ దగ్గర వుందా?" అన్నాను.

"రావోయ్" అని లోపలికి లాక్కెళ్ళాడు.

అక్కడ తోటలో ఓ బల్ల ముందు కూచున్నాము. ఇంద్రలోకం మల్లే వుంది. తినడానికి ఏవేవో అర్థంగాని పేర్లతో ఆర్డర్లిచ్చాడు.

"చూడు-వాళ్ళిద్దరూ పవిత్రతలో వున్నారు. ఆ పని అపవిత్రం వాళ్ళ మనసుల్లో.....

అని ప్రారంభించాడో లేదో, ఇంతలో దూరంగా ఓ యూరోపియన్ అమ్మాయి కనబడితే ఆమెని కేకేసి ఆపి లేచి వెళ్ళిపోయినాడు నా వంక చూడకుండా. బట్లరు ఏ వేమిటో తెచ్చాడు. కాని అవి తినవచ్చో లేదో వాటిల్లో ఏంవేసి తయారుచేశారో తెలీక కూచున్నాను. దూరంగా ఓ బల్ల దగ్గిర ఆ అమ్మాయితో సరాగాలాడుతున్నాడు కోసలరావు. ఇందుకా నన్ను తీసుకొచ్చింది ఇక్కడికి? ఏదో పాఠం చెబుతున్నట్లు మాటలనిపించి నవ్వుతున్నాడు ఆమెతో. కొంత సేపయిం తరువాత ఇద్దరూ నాబల్ల దగ్గిరికి వొచ్చారు. ఆ ఫలహారాల్లో కొన్ని ఏరి, 'ఇది నువ్వు తినవొచ్చు, తినమని తక్కినవి వాళ్లు తినేశారు. వాళ్ళిద్దరూ విస్కీ తాగిం తరవాత, "పద పోదాం" అన్నాడు.

"దీ న్నెందుకు లాక్కొచ్చావు?"

"నీ పని మీదనే."

ఇదంతా నా పనే!

బిల్లు పాతిక రూపాయలు నా డబ్బేగావును-ఇచ్చాడు.

ముగ్గురం టెలిఫోను బూత్ దగ్గిరికి వెళ్ళాం. ఆ అమ్మాయికి ఏదో నంబరు చెప్పాడు.

పన్నెండు కొడుతోంది అప్పటికి. ఎవరో పలికారు ఆ అమ్మాయికి.

"చాలా అవసరం. నువ్వోమాటు రావాలి వెంటనే" అని చెప్పి, టెలిఫోను కింద పెట్టేసింది.

ఆ అమ్మాయికి పది రూపాయలు-నావి-యిచ్చాడు - వొచ్చేశాం.

హెూటల్నుంచి బయటికి వెళ్ళి ఏదో డాన్సు చూసి ఇంటికి పోయి పడుకున్నాము.

మర్నాడు నా డబ్బు వొచ్చింది. ఆ డబ్బు అడిగి తీసుకున్నాడు కోసలరావు. ఎందుకిచ్చా వంటే అంతే మరి!

"ఎక్కడికి?"

"ఎక్కడి కేమిటి?" ఇంటికి. కలకత్తా బాగా మరిగావే! ఇంక నీకు ఇల్లూ, పెళ్ళాం అక్కర్లేదా ఏమిటి?" అన్నాడు.

"వొచ్చిన పని?"

"నా కిక్కడ ఇంకేం పనిలేదు."

"మరి నా పని"

"వొచ్చిన పని అయింది కనుకనే పోతున్నాం."

"ఏమయింది?"

"ఏదో ప్రస్తుతం అయింది. తక్కినది ఇంకోసారి చూసుకోవచ్చు" అన్నాడు.

రైలెక్కాం మొత్తానికి.

రైల్లో మళ్ళీ ఫస్టుకాస్లులోనే. రెండువేల రూపాయలు క్షవరం.

ఇల్లు చేరుకున్నాము.

ఏం చెప్పను నా భార్యకి!

పదిహేను రోజులు పోయి, రెండు వేలు ఖర్చు చేసుకు వొచ్చాను. కాని అది నోరెత్తితే 'నువ్వేకదా పంపించింది!' అని బాగా తిడదామనుకున్నాను.

ఇంటికి వెళ్ళగానే మరునాడు పొద్దున్న-

"ఇవిగో, నీ రెండువేల రూపాయలూ! అని కోసలరావు రెండు కాయితాలు నావేపు గిరాటేశాడు. ఏమిటీ వేళాకోళం అని చూస్తే నిజంగా అవి రెండు వెయ్యిరూపాయల నోట్లు!

"ఇదేమిటి?"

"నీ అదృష్టం. మొదటి నీ వెయ్యీ పోయినాయి స్పెక్యులేషన్‌లో. రెండో వెయ్యికి ఓ లక్ష వొచ్చాయి" అని ఆ నోట్లకట్టని నా మొహాన ఆడించాడు.

నాకు ధైర్యంలేదు కాని, నా భార్య పట్టుకుంది అతన్ని. ఏం చేసుకొచ్చారని. ఓ వారంలో చెపుతా నన్నాడు. అన్నట్టే వారానికల్లా పేపర్లో ఫోటోలతో సహా, సుప్రసిద్ధ నర్తకి సవితాదేవికీ, సుప్రసిద్ధ చిత్రకారుడు గోవర్ధన్‌కి పెళ్ళి జరిగిందని పడ్డది.

ఏం మాట్లాడ్డం ?

"నేను ఎట్లా కొడితే, అట్లా పడాలి. చూశారా, నా ప్రజ్ఞ" అన్నాడు.

"వాళ్ళిద్దరికీ పెళ్ళి అయితే ఇంకేం ఆశవుంది" అంది నా భార్య.

"నేను సైకలాజికల్‌గా వెళ్ళాలి అన్నానా? అసలు ఒక ఆడదంటో అతనికి అవసరం కలిగిస్తే ఇంకో ఆడదానిమీద కలిగించవచ్చు. అదీ సంగతి. ఆ కళామందిరంలో వాళ్ళు బ్రహ్మచారిణులు. మీ అల్లుడిమీదే ఆమెకు మనసు. కాని శరీర సంపర్కం కళకి అపరాధం తెలిసిందా? ఇతనికి ఆమెకి హారతులు ఇవ్వడం, ఆమెని పువ్వులతో అలంకరించడం పని. అంతే! తక్కింది వీలులేదు. అట్లా ఒక స్త్రీ దైవతై,ఆ దేవతని స్త్రీగా ఉపయోగించడానికి వీలులేని మొగాడికి త్వరలో పిచ్చెక్కుతుంది. కాగా ఎందుకు పనికిరాడు. ఆమె అన్నట్లు కళకే అంకిత మవుతాడు."

"మరి ఆమెమీద అంత ప్రేమకదా అతనికి?"

"ఎన్నాళ్లు? అట్లా ఆరాధించినన్నాళ్ళే. యేం ఫరవాలేదు. అంతే. కాదు. మామూలు ఆడవాళ్ళతో సంసారం చెయ్యొచ్చు. వాళ్ళకి పిల్లల్ని కనవొచ్చు. కాని ఈ చదువులకీ, మేధస్సులకీ, కళలకీ అంకితమైన వాళ్ళతో ఓ గంట పగలుగాని, రాత్రిగాని స్థిరంగా సంసారం చెయ్యలేరు. చూడండి, ఆమెకెంత స్వతంత్ర గర్వమనుకున్నారు!"

"మరి ఈ పెళ్ళి ఎట్లా జరిగింది?"

"ఏం లేదు. ఆమె మందిరపు అజమాయిషీదారుతో స్నేహం చేసుకున్నాను. గోవర్ధన్ నాకు తెలుసు. ఓ సాయంత్రం అతన్ని కలుసుకుని పని వుంది పదింటికే రమ్మన్నాను. వొచ్చాడు.

అవసరంగా ఈ పుస్తకంమీద రెవ్యూ కావాలి. నాకోసం తెల్లారే లోపల రెండు ముక్కలు రాసిపెట్టమని, కాయితం చుట్టి చలం మైదానం ఇచ్చి, అతన్ని ఇంటి దగ్గర వొదిలి వొచ్చాను. చదవడం ప్రారంభం చేయించి.

చలం పుస్తకాలంటే నాకు అసహ్యం. ఎందుకంటే కాయితాలు పక్క దుప్పట్లనుకుంటాడు అతను. కాని ఏ పనికిమాలిన వస్తువుకీ సమయాన్నిబట్టి ఓ ఉపయోగమంటో కలుగుతోవుంటుంది. నాకు తెలుసు. ఆ 'మైదానం' మధ్యకి పోయినాడా ఎవడన్నా అర్ధరాత్రి, వాడికి ఇంక ఏ మన్మద క్రియలూ అవసరం వుండవు. మంచం చుట్టూ చీకట్లన్నీ స్త్రీ రూపాలు ధరిస్తాయి. అంటే మనవాణ్ని సరైన మనస్థితిలో వుంచా నన్నమాట. తరవాత ఆ హొటలుకి వెంటనే రమ్మని సవితపేర టెలిఫోను చేయించానా? ఏం ఉపద్రవం వొచ్చిందోనని పరిగెత్తి వుంటాడు. సవిత గది హాలులోకి తెరుచు కుంటుంది. ఆ హాలు బయట గొళ్ళెం వేయమని అజమాయిషీ దారుతో ముందే చెప్పి వుంచాను, ఓ వంద రూపాయలు లంచం పెట్టి. ఇంక ఆ రాత్రి ఏం జరిగి వుంటుందో 'మైదానం'తో మత్తెక్కి తెగబడ్డ మీ అల్లుడి ముందు సవితాదేవి మాత్రం కళని అడ్డం పెట్టగలదా? యోచించుకోండి, పర్యవసానం పెళ్ళి!"

"మరి ఆమెకి ఇదివరకే పెళ్ళి జరిగిందన్నారుగా?"

"కాని ఆ భర్త ఏమైనాడో తెలీదు. అందుకనే ఈ పెళ్ళి చెల్లనూ చెల్లదు. చెల్లినా ఆ సవితాదేవి ఏ భర్తనీ భరించలేదు. ఇంక నేను చెయ్యవలసింది ఏమీలే"దంటూ రైలెక్కాడు కోసలరావు.

రెండు నెలలలో గోవర్ధన్ మా యింటికి వొచ్చాడు. ఒంటరిగా. మా అమ్మాయికి ఇప్పుడు ఇద్దరు మొగపిల్లలు.

ఈ సమయంలో కోసలరావే వుంటేనా!

◆ ◆ ◆

*రచనాకాలం : 1948,*

*ప్రచురణ : (ఆరాత్రి కథలు) ఎమెస్కో, 1971*